

క్రైమ్ కథల పోటీలో
ప్రత్యేక సంచిక కోసం
ఎంపిక చేయబడిన కథ

# డబ్బు జబ్బు

— సర్వజిత్

ఆసుపత్రిలో ఔట్ పేషంట్ల కోసం వేసిన బల్ల మీద కూర్చున్నాడు చలపతి. అతని పక్కనే భార్య లక్ష్మమ్మ కూర్చుంది.

ప్రపంచంలో ఉన్న దైన్యం అంతా ఆమె ముఖంలోనే వుంది. మనిషి బాగా ఒడిలిపోయింది. దానికి తోడు జబ్బు చేసిందన్న దిగులు ఆమెను మరింత కృంగదీసింది.

వాళ్లకి కొంచెం దూరంగా కొడుకు చిన్నారావు, అల్లుడు నారాయణ, కూతురు కాముడు నిల్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. "ఎలా ఉంది?" భార్యముఖం పరిశీలనగా చూసి అడిగాడు చలపతి.

'అబ్బె! ఏం లేదు' అన్నట్లు తల అడ్డంగా తిప్పింది లక్ష్మమ్మ.

అక్కడ పేషంట్లు పెద్దగా లేరు. మహా అయితే పదిహేను మంది మించి వుండరు. కానీ డాక్టరుగారు ప్రతి పేషంటునీ చాలా సేపు చూస్తారు. ఆయన కొంచెం చాదస్తం మనిషి అని అందరూ చెప్పుకొంటారు.

ఆయన నగరంలో చాలా సీనియర్ డాక్టర్. ఆయన గురించి తెలిసి వున్న వాళ్లు తప్ప పెద్దగా పేషంట్లు రారక్కడికి.

అక్కడి వాతావరణం చూశాక ఇక్కడికెందుకొచ్చామా అని అనుకున్నాడు చిన్నారావు. నారాయణా అలానే అనుకున్నాడు. కానీ పైకిమాత్రం ఏమీ అనకుండా ఊరుకున్నాడు. చిన్నారావు చెల్లెలు కాముడు మాత్రం పైకే అనేసింది: "ఈ హాస్పటల్‌కి ఎందుకు తీసుకొచ్చావ్ అన్నయ్యా?" అని.

"ఈయన పెద్ద డాక్టరు కదా! ఓసారి ఇక్కడా చూపిద్దాం" అన్నాడు చిన్నారావు.

నిజానికి చలపతి మనసులోనూ అదే అభిప్రాయం ఉంది. నగరంలో ఉన్న పెద్ద పెద్ద హార్టు స్పెషలిస్టు డాక్టర్లను వదిలిపెట్టి తన భార్యను ఇక్కడికి తీసుకురావడం అతనికీ ఇష్టంలేదు. కానీ తప్పలేదు.

వారం కిందట చాతీలో నొప్పిగా వుందంటే లక్ష్మమ్మను తమ వీధి చివర ఆర్.ఎం.పి. డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాడు. ఆయన ఏదో ఇంజెక్షన్ చేసి పెద్ద డాక్టర్‌కి చూపించమన్నాడు.

పెద్ద డాక్టర్ అనబడే ఎం.బి.బి.ఎస్. డాక్టరు దగ్గరికి తీసుకెళితే 'ఇది నా కేసు కాదు. హార్టు స్పెషలిస్టుకి చూపించండి' అన్నాడు.

దాంతో నగరంలో ఓ మాదిరి పేరున్న గుండెజబ్బుల డాక్టరు దగ్గరికి లక్ష్మమ్మను తీసుకెళ్లారు.

పెద్ద డాక్టరు తన వల్ల కాదన్నప్పుడు చలపతి గుండె ఝల్లుమంది చిన్నారావుకి భయం వేసింది. కాముడికి కన్నీళ్లొచ్చేశాయి.

లక్ష్మమ్మకి పెద్ద పెద్ద వాళ్ళకొచ్చే గుండె జబ్బొచ్చిందని అల్లుడు నారాయణతో సహా అందరూ భయపడిపోయారు.

హార్టు స్పెషలిస్టు దగ్గరకెళ్లగానే అత్యవసర కేసుగా చేర్చేసుకుని

వెంటనే ఇ.సి.జి. వగైరా టెస్టులకి ఏర్పాట్లు చేసేశారు.

ముందుగా ఓ మూడు వేల రూపాయలు కట్టమన్నారు. ఏడెనిమిదొందలు జేబులో వేసుకొచ్చిన చిన్నారావు సాయంత్రంలోగా మూడువేలు కడతానంటే కుదరదన్నారు.

'మందులు కొనాలనీ, అందాకా తమ దగ్గర వాడమని, ఇంకా టెస్టులు చేయాలనీ.... పోనీ ఓ గంటలో కట్టెయ్యాలనీ...' వాళ్లు హడావుడి పడుతూ వీళ్లని హడావుడి పెట్టేశారు. దాంతో చిన్నారావుకి కాళ్ళాడలేదు. బావ నారాయణతో కలిసి సైకిల్‌మీద బయలుదేరాడు. ఎక్కడో తంటాలు పడి తెచ్చి డబ్బుకట్టాడు.

లక్ష్మమ్మకి తీవ్రంగా గుండెజబ్బు వచ్చిందని డాక్టర్ సీరియస్‌గా ముఖం పెట్టి చెప్పాడు. ఆమెను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐ.సి.)లో పెట్టారు. జబ్బు మాటెలా ఉన్నా ఎ.సి.లో ఆమెకు బాగానే వుంది. కూతురు కాముడు మాత్రం తల్లిదగ్గిర వుంది.

ఆమెకు ఏవేవో ఐదారు టెస్టులు చేశారు. సెలైన్ పెట్టారు.

ప్రతిపావుగంటకు డాక్టర్లు వచ్చి ఆమెను పరీక్షిస్తున్నారు. చార్టులో ఏదేదో రాస్తున్నారు. వాళ్ల వైద్యభాషలో వాళ్లు మాట్లాడుకుంటున్నారు.

బిక్కముఖం వేసుకుని కాముడు వాళ్లని చూస్తోంది. ఆ వార్డులో ఇంకా పదిమంది దాకా ఉన్నారు. కొందరికి ముక్కుకి మాస్కులు వేసి గ్యాస్ సిలెండర్‌కి తగిలించారు. అలాగే రకరకాలుగా వున్నారు.

"అంతకు ముందు ఇలా నొప్పి వచ్చిందా" అనడిగాడు లక్ష్మమ్మను ఓ డాక్టరు.

"ఎప్పుడూ రాలేదు బాబూ" చెప్పింది.

"కాదు... వచ్చే వుంటుంది. నీకు తెలిసి వుండదు. ఇది రెండోసారి నీకు నొప్పి రావడం".

"నొప్పొచ్చినట్లు గుర్తు లేదండి".

"యూ ఆర్ లక్కీ.. ఇప్పుడు కనక కొంచెం స్ట్రాంగ్‌గా వచ్చి వుంటే అయిపోయేదానివే... ఇక్కడికి రావడం కొంచెం ఆలస్యమైనా ఆశ వదులుకోవలసి వచ్చేది..."

డాక్టరు ఆ మాట అనగానే లక్ష్మమ్మ చేతులెత్తి వాళ్లకి నమస్కరించింది తన ప్రాణం కాపాడినందుకు.

కాముడికి మళ్లీ కళ్లు చమర్చాయి. అమ్మ బ్రతికినందుకు – బ్రతికించినందుకూ...

☆ ☆ ☆

ఉదయాన్నే కాఫీ ఫ్లాస్కు పట్టుకుని ఆసుపత్రికి వచ్చిన చిన్నారావుకి ఎదురొచ్చి చెల్లెలు కాముడు మందులు చీటీ అందించింది! "అర్జంటు" అంటూ.

మళ్లీ పదిగంటల సమయంలో సిస్టర్ వచ్చి చిన్నారావుకి చీటీ ఇచ్చింది. "ఈ టెస్టు చేయాలి డబ్బు కట్టండి' అంటూ.

మరో మందులచీటితో ఆరోజు గడిచింది.

లక్ష్మమ్మ ఐ.సి.లోనే వుంది. వచ్చిన రోజు ఎలా వుందో ఇప్పుడూ అలానే వుంది. దానికి తోడు జబ్బుకన్నా ఇప్పుడు ఆమెకు మరో దిగులూ పట్టుకుంది.

అది ఆసుపత్రి ఖర్చు గురించి. ఎలా తెస్తున్నారో, ఎక్కడ నుంచి తెస్తున్నారో అని ఆమె ఆందోళన పడుతోంది.

ఆమె ప్రమేయం లేకుండా జబ్బులకి ఇంజెక్షన్లు పొడుస్తున్నారు. గంటకోసారి సిస్టర్ వచ్చి ఆమె నోరు పెకలించి ఏవేవో బిళ్లలు వేసి నీళ్ళు పోస్తుంది. "మా అమ్మకెలా వుందండి?" అని కాముడు అడిగినప్పుడల్లా.

"రెండుమూడురోజులు అబ్జర్వ్ చెయ్యాలి. అప్పుడే ఏం చెప్పలేం. ప్రస్తుతానికి ప్రమాదం మాత్రం తప్పింది" అంటున్నారు డాక్టర్లు.

మూడోరోజు సాయంత్రం మళ్లీ నాలుగు వేలు కట్టమన్నారు. అల్లుడు నారాయణ కూడా ఎక్కడో అప్పుతెచ్చిఇచ్చాడు. ఆరో రోజు లక్ష్మమ్మ మెడలో పుస్తెల తాడుస్తానే పసుపు కొమ్ము కట్టుకుంది. చిన్నారావు భార్య మెడలో పుస్తెల తాడూ మారింది.

"మా అమ్మ పరిస్థితేంటో సరిగా తెలీడం లేదు. ఈమందులు, ఈ టెస్టులు.. మాలాంటోళ్లం ఏం తట్టుకుంటాం...".

ఓరోజు సాయంత్రం ఆసుపత్రి ఆవరణలో చెట్టుకింద కాంపౌండర్‌కి టీ ఇప్పించి తనూ తాగుతూ యధాలాపంగా అన్నాడు చిన్నారావు.

టీ తాగడం పూర్తయ్యాక, సిగరెట్ వెలిగించి ఓ దమ్ములాగి పొగ వదులుతూ అన్నాడు కాంపౌండరు:

"అవును మరి మీలాంటోళ్లు తట్టు కోలేరు. మరి లక్షలు పోసి ఇంతింత బిల్డింగ్‌లు కట్టారా! లక్షలు పోసి ఫారెన్ కంట్రీల నుంచి మిషన్లు తెప్పించారా! మరయన్నీ ఏం చేసు కోవాలె? పని లేకపోతే తుప్పట్టిపోవూ. అందుకే ఆ టెస్టులన్నీ చెయ్యాలి".

చిన్నారావుకి అర్థమయీ కానట్టనిపించింది.

"మా డాక్టరుగారు ఫారెన్‌లో చదూకొచ్చారు. బోల్డు ఖర్చయ్యింది మరి. ఆళ్లబ్బాయినీ ఫారెన్‌లోనే చదివిస్తున్నారు. బోల్డవుద్ది మరి. అంతెందుకు మీ అమ్మని ఎ.సి. రూంలో పెట్టారా! మీరు లోపల కూకుంటే ఫ్యాన్లెయ్యాలా! గంట గంటకీ ఫినేల్‌తో క్లీనింగ్ చెయ్యాల! లిఫ్టులో పైకీ కిందకీ ఎల్లాలా! ఆటన్నిటికీ బోల్డవుద్ది మరి...."

ఇంతలో చిన్నారావుని డాక్టరుగారు పిలుస్తున్నాడంటే వెళ్ళాడు.

"ఎల్లెల్లు... అప్పుడే ఏమవుద్దీ!?"

కాంపౌండరు సిగరెట్ పారేసి కాలితో నలుపుతూ సణుక్కున్నాడు.

డాక్టరుగారి ముందు చేతులు కట్టుకుని నిల్చున్నాడు చిన్నారావు. ఆ వెనకగా చలపతీ, ఆ ప్రక్కనే కాముడూ నిల్చున్నారు.

"మీ అమ్మగారేకదూ?" డాక్టరు కళ్లజోడు పైనుంచి చూస్తూ చిన్నారావుని అడిగాడు.

అవునని తలూపాడు చిన్నారావు. "పొజిషన్ చాలా క్రిటికల్‌గా ఉందోయ్. ఒక వాల్వు బ్లాక్ అయ్యింది... కొంచెం ఖరీదైనదే... ఓ ఇంజెక్షన్ చెయ్యాలి మరి" క్షణం ఆగి ఆ ముగ్గురి ముఖాలకేసి చూశాడు డాక్టర్.

ఏం చెప్పాలో చిన్నారావుకి అర్థం కాలేదు. తండ్రికేసి, చెల్లెలుకేసి చూశాడు.

ఆలోచించమన్నట్లు డాక్టర్ తల ఊపి వెళ్ళమన్నాడు. తండ్రీ, కొడుకులు బయటకొచ్చారు.

వాళ్లు బయటకు రాగానే రిసెప్షన్ వాళ్లు పిలిచి 'రెండువేలు ఇంజెక్షన్ కోసం' కట్టమన్నారు. కొడుకును కూర్చోపెట్టి చలపతి వెళ్లాడు డబ్బుకోసం....

☆ ☆ ☆

మరో రెండు రోజులు గడిచాయి.

లక్ష్మమ్మ ముఖం కొంచెం తేటగా అనిపించింది. కూతురు కాముడికి.

'ఎలా వుందే అమ్మా' అంటే – 'బానే ఉందే.... ఇంటికి వెళ్లిపోదాం' అంటోంది.

ఆరోజు సాయంత్రం డాక్టరుగారు పిలిచారు చలపతిని, చిన్నారావుని. చిన్నారావు గుండె వేగంగా కొట్టుకుంది. నిండా మునిగిన వాడికి చలేమిటి అన్నట్టు చలపతి డాక్టరు దగ్గరికెళ్లి, వినయంగా నిల్చున్నాడు.

డాక్టరు వాళ్లిద్దరినీ చూశాడు. దురద లేకపోయినా బుర్ర గోక్కున్నాడు. స్టెతస్కోపు సవరించుకున్నాడు. కళ్లజోడు తీసి టేబుల్ మీద పెట్టి, క్షణం పోయాక మళ్లీ పెట్టుకున్నాడు. ముఖం గంభీరంగా మార్చుకున్నాడు. లక్ష్మమ్మ కేస్‌షీటు తెప్పించి అక్షరం, అక్షరం పరిశీలనగా చూశాడు. కళ్లుమూసుకుని తల అటూ, ఇటూ తిప్పాడు. "సీ... ఆవిడకి ఒక వాల్వ్ బ్లాక్ అయ్యిందని చెప్పాకదా?" అన్నాడు డాక్టర్.

తండ్రీకొడుకులు జంటగా తలూపారు. "ఇప్పుడు యాంజియోగ్రాం అని...ఓ టెస్టు చేయాలి.. చాలా అవసరం" చెప్పలేక చాలా బాధగాచెబుతున్నట్లు బరువుగా చెప్పాడు డాక్టర్.

తండ్రీ కొడుకులు ముఖముఖాలు చూసుకున్నారు.

"ఇది కొంచెం ఖరీదైన టెస్టు....." క్షణం ఆగి వాళ్లకేసి చూసి కళ్లజోడు తీసి బల్లమీద పెట్టాడు డాక్టరు.

"మరీ అవసరం అయితే తప్ప ఈ టెస్టు చేయం...కళ్లజోడు పెట్టుకుంటూ అన్నాడు.

"మామూలుగా అయితే ఇరవై వేలు పైన అవుతుంది. ఎల్లుండయితే పద్దెనిమిదివేలే... వారానికోసారి తక్కువని చేస్తారు. మీ లాంటి వాళ్లకోసమే ఆసుపత్రి ఆ కన్సెషన్ ఇస్తోంది".

డాక్టర్ చెప్పడం ఆపి స్టెతస్కోప్ సవరించుకున్నాడు.

వాళ్ల ముఖాల్లో ఏ స్పందనా కనిపించలేదాయనకు.

"రేపు సాయంత్రానికి మీరు ఏర్పాటు చేయగలిగితే ఎల్లుండికి రెడీ చేస్తాం.... ఆటెస్టు చేస్తే కానీ కరెక్టుగా ఏ సంగతీ నిర్ధారించలేం... బైపాస్ సర్జరీ అవసరమా లేదా అనేది అప్పుడే నిర్ణయించాలి...ముందే చెప్పానుగా... కొంచెం ఖరీదైనదే.. కానీ తప్పదు..." ఇక మీరు వెళ్ళచ్చు అన్నట్లు సీట్లోంచి లేచాడు డాక్టరు.

తండ్రీ కొడుకులిద్దరూ బయటకు వచ్చారు. 'ఏమన్నారు' అంటూ ఎదురొచ్చిన అల్లుడికి జరిగింది చెప్పారు.

ఏదో కాస్తంత తేలికపడింది లక్ష్మమ్మను ఇంటికి పంపిస్తారనుకుంటే పులి మీద పుట్రలా ఈ టెస్టు మాట చెప్పేసరికి వాళ్ళకి గుండెపోటు వచ్చినంతపనయ్యింది. ఇంత వరకూ ఖర్చుపెట్టడమే వాళ్లకి తలకు మించిన భారమయ్యింది. మళ్ళీ ఇరవై వేలంటే ఏం చెయ్యాలో వాళ్లకి తోచలేదు.

"తప్పద్దేటి మరి... ఎలాగో తంటాలు పడాలి మరి..." అల్లుడు నారాయణ అన్నాడు.

ఈ వారం రోజుల్లో బాగా పరిచయమయిన కాంపౌండర్‌ని సలహా అడిగాడు చిన్నారావు.

'మిషన్లు ఖాళీగా వున్నాయి..... పీల్చేత్తన్నారు....' అని గొణిగాడు చిన్నారావుకి వినిపించకుండా.

"అంతిచ్చుకోలేమని చెప్పు. కాదంటే డిశ్చార్జీ సేసెయ్యమను" అని సలహా యిచ్చాడు.

అదే మంచిదనిపించింది చిన్నారావు కి. ఇంక ఒక్కరోజు కూడా భరించగలిగే స్థితిలో లేరు వాళ్లు.

తండ్రిని, బావని తీసుకుని డాక్టరు దగ్గర కెళ్లాడు చిన్నారావు.

"ఏమాలోచించారు? ఎల్లుండి టెస్టుకి రెడీ చెయ్యిమంటారా?" డాక్టరు అడిగాడు.

"ఇంక మా వల్ల కాదు డాక్టరుగారూ" అంటూ చలపతి రెండు చేతులూ జోడించాడు.

"అదేంటయ్యా అలా మాట్లాడతావ్.... ఆమె నీ భార్య... ఏమయ్యా నీకు తల్లి కదా! భార్యకోసం నువ్వు.... తల్లి కోసం నువ్వా ఆ మాత్రం ఖర్చు పెట్టలేరా...రోగాలు మనకి చెప్పి వస్తాయా...గుండెపోటువచ్చింది..తగిన వైద్యం చేయించాలి... పది కాలాలు బతుకుతుంది..."

"మేం తట్టుకోలేమండి..." చిన్నారావు నసిగాడు.

"ఏమిటయ్యా నువ్వా అలా మాట్లాడతావ్? నిన్ను నవమాసాలు మోసి కన్నదయ్యా.... ఇవ్వాళ ఆమెకు జబ్బు చేస్తే డబ్బుల్లేవంటా వేమిటి?" డాక్టరు సెంటిమెంటు మీద ఉపన్యాసం ఇస్తున్నాడు.

చిన్నారావు కళ్లు చెమర్చాయి. చలపతి పరిస్థితీ అలానే వుంది. కానీ ఇరవై వేలు తేగలిగే పరిస్థితి కనిపించడం లేదు.

ఉపన్యాసం ఇచ్చి అలసిపోయిన డాక్టరు మంచినీళ్లు తాగాడు. వాళ్లలాగే నిల్చున్నారు.

"సరే! ఏం చెయ్యమంటారు?" డాక్టరు అడిగాడు ఇంక మాట్లాడి ప్రయోజనం లేదని.

"మా అమ్మని తీసుకెళతామండి" అన్నాడు చిన్నారావు.

"చూడు! ఆమె పరిస్థితి ఏ క్షణంలోనైనా ప్రమాదమే. తీసికెళతానంటున్నారు. తరువాత మమ్మల్నని ప్రయోజనం లేదు" అనేసి డాక్టరు చటుక్కున ఏదోపని వున్నట్లు లేచి వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం లక్ష్మమ్మను ఇంటికి తీసుకొచ్చారు. రెండురోజులు పోయాక వాళ్లూ వీళ్లూ చెప్పగా వేరే డాక్టరు దగ్గరికి తీసు కెళ్లారు....

కాస్సేపటికి అక్కడ ఉన్న కొద్దిపాటి పేషంట్లు పల్చబడ్డారు. లక్ష్మమ్మకి పిలుపొచ్చింది డాక్టరుగారి దగ్గర్నుంచి. చిన్నారావు తల్లిని జబ్బ పట్టుకుని తీసికెళ్లాడు. వెనకాల చలపతీ వెళ్లాడు. "ఏమిటి సమస్య" డాక్టర్ అడిగారు.

చలపతి జరిగిందంతా చెప్పాడు. తమ అశక్తత చెప్పాడు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆమెకు సంబంధించిన రిపోర్టులు చూపించారు.

ఆయన లక్ష్మమ్మని క్షుణ్ణంగా పరీక్షించాడు. ఏవో ప్రశ్నలడిగారు. చేసిన పరీక్షలే మళ్లీ చేశాడు. మందులు రాసిచ్చాడు. "వారం రోజులు వాడు. వారం అయ్యాక రా.." అన్నారాయన.

ఆమె లేచింది.

'ఏం భయంలేదు... గ్యాస్ట్రబుల్" అన్నారాయన.

లక్ష్మమ్మకి ఎగిరి గంతెయ్యాలని పించింది. చలపతీ, చిన్నారావూ ఊపిరి పీల్చు కున్నారు.